విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 11, జనవరి 2025

తాగునీరు, పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించాలి

విశాలాంధ్ర - బనగానపల్లె : బనగానపల్లె పంచాయతీ కార్యాలయంలో బనగానపల్లె మండల అధికారులతో త్రాగునీరు, పారిశుద్ధ్యంపై రాష్ట్ర మంత్రివర్యులు బీసీ జనార్ధన్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకూ కనీస మౌలిక అవసరాలైన త్రాగునీరు,విద్యుత్, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వంటివాటిపై దృష్టిపెట్టాలని అధికారులకు సూచించారు. మండలంలో అన్ని గ్రామాలను పారిశుద్ధ్యంగా ఉంచడంతో పాటు, ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య సిబ్బంది ఎంతో కష్టపడుతున్నారని, వారి వేతనాలు పెంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మన చుట్టు ప్రక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, ప్లాస్టిక్ రహిత బనగానపల్లె లక్ష్యంగా అధికారులు పనిచేయాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమణ, ఈఓఆర్డి బొమ్మిరెడ్డి సతీష్ కుమార్ రెడ్డి, విద్యుత్ ఏఈ లు శ్రీనివాసులు, గజప్ప ఉప సర్పంచ్ బురానుద్దీన్,వార్డ్ మెంబర్ అత్తర్ కలం బనగానపల్లె మండల వ్యాప్తంగా గ్రామ పంచాయితీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది తదితర అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్దే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

విశాలాంధ్ర - నందికొట్కూరు : మత్స్యకారుల అభివృద్దే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నంద్యాల పార్లమెంటు సభ్యురాలు డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం నియోజవర్గ పరిధిలోని పగిడాల మండలం నెహ్రూ నగర్ గ్రామంలో మత్స్య శాఖ అధికారులతో కలసి శ్రీశైలం బ్యాక్ వాటర్ జలాశయంలో ఎంపీ బైరెడ్డి శబరి సీడ్ చేప పిల్లలను వదలడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మత్స్యకారుల ఆర్థిక ప్రగతికి ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయనీ మన రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభ్యున్నతికి నూతన పథకాలు ప్రవేశపెడుతూ, వారికి స్థిరమైన జీవనోపాధి కల్పించేందుకు కట్టుబడి ఉందన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా డీఎఫ్‌సీఎస్ చైర్మన్ బియస్ నవీన్ కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం జలవనరుల సమర్థ వినియోగంతో పాటు మత్స్యకారుల ఆదా యాన్ని పెంచడంలో దోహదపడుతుందనీ, అదేవిధంగా మస్త సంపద పెంపొందించడం మత్సకారుల జీవితాలలో వెలుగులతో కూడిన మార్పులు తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామన్నారు. జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ రాఘవ రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫీసర్ శ్యామల అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ సంధ్యారాణి పగిడాల ఎంపీడీవో సుమిత్రమ్మ నెహ్రూ నగర్ సర్పంచ్ కూరాకుల రాజేశ్వరి ,స్థానిక మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమం ప్రభుత్వానికి పట్టదా..

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : చాలాకాలంగా పెండింగ్లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను సత్వరమే విడుదల చేయాలని ఎస్టీయూ నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.మౌలాలి, ఎం.ఆజంబేగ్‌లు డిమాండ్ చేశారు. పట్టణంలోని శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో జరిగిన 78వ నంద్యాల జిల్లా కౌన్సిల్ సమావేశంలో జిల్లా ఇన్చార్జి సురేష్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం కూడా ప్రభుత్వాల బాధ్యత అన్నారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.శివశంకర్, రాష్ట్ర కార్యదర్శులు ఇవి. గోపాలకృష్ణ, ఇక్బాల్‌లు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై పని భారం పెంచే యాప్‌లను వెంటనే తొలగించాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు,మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై వెంకట్రాంరెడ్డి, మాజీ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జి ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర ఖైల కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్, రాష్ట్ర వెబ్సైట్ కన్వీనర్ నాగేంద్ర కుమార్, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బారాయుడు, మాజీ జిల్లా అధ్యక్షులు ప్రసాద్, జనవిజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షులు విశ్వనాథ్, ఎస్టియు సీనియర్ నాయకులు జయప్రకాష్, వివిధ మండ లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్టీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే
మంత్రి ఇంటిని ముట్టడిస్తాం

ఇళ్ల పట్టాలు ఇచ్చేవరకు పోరాటం ఆగదు
సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు

విశాలాంధ్ర - డోన్ : సంక్రాతి పండుగ లోపు దరఖాస్తు చేసుకున్న పేద ప్రజలకు ఇళ్ల పట్టలైవ్వకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు స్పష్టం చేశారు. శుక్రవారం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డోన్‌లో ఆర్డీవో కార్యాలయం దగ్గర సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన ధర్నా ఈ కార్యక్రమానికి సీపీఐ పట్టణ కార్యదర్శి మోట రాముడు అధ్యక్షతన వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు స్వంత గృహం లేక అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందు లెదుర్కొంటున్న నిరు పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలన్నారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇచ్చి గృహ నిర్మాణానికి ఐదు లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్లులేని నిరు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, కూటమి సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన ఇళ్ల స్థలాల హామీలను అమలు చేయాలన్నారు. అలాగే గృహ

నిర్మాణానికి 5లక్షలు రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బి.నారాయణ, సహాయ కార్యదర్శి వరదరాజులు, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రామ్మోహన్, చేతివృత్తిదారుల జిల్లా కార్యదర్శి రామ్మోహన్, మహిళా సమైక్యజిల్లా ఆర్గనైజ్ కార్యదర్శి షమీం బేగం, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్, మండల కార్యవర్గ సభ్యులు బాల మద్దయ్య,మహిళా సమైక్య మండల కార్యదర్శి అమృత రెడ్డి, పట్టణ కార్యదర్శి సిరీన్, నాయకురాలు జే మాధవి, మాధవి లత, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి మనోజ్, ఏఐవైఎఫ్ నాయకులు రజాక్, శాఖా కార్యదర్శులు కొండయ్య, వెంకటేశు, మనోహర్, పాపారాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి
సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్ : భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శుక్రవారం నంద్యాల పట్టణంలోని ఇల్లు లేని నిరు పేదలతో తహశీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్ అధ్యక్షతన పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంమలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ రంగనాయుడు మాట్లాడుతూ సిపిఐ రాష్ట్రసమితి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇల్లు లేని నిరుపేదలకు పట్టణాలలో రెండు సెంట్లు గ్రామాలలో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలని నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. గతంలో నంద్యాల జిల్లాలో నవంబర్ 18వ తారీఖున అన్ని మండల గ్రామాల పట్టణ సచివాలయంలలో ఇల్లు లేని నిరు పేదలతో వ్యక్తిగత అర్జీలను ఇప్పించడం జరిగింది. రెండవ విడత మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఇల్లు లేని నిరుపేదలతో ధర్నా నిర్వహించారు. త్వరలో జిల్లా వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర బాధితులతో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. ఉద్యమాలకు ప్రభుత్వం నుండి స్పందన రాకపోతే పేద ప్రజల కోసం నంద్యాలలో మంత్రి ఇల్లును ముట్టడిస్తామని అన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్ మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో ఇల్లు లేని నిరుపేదలతో శుక్రవారం 300 మందితో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి అనంతరం డిప్యూటీ తహసిల్దార్ రామ సంజీవయ్యకి అర్జీలను ఇప్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీ యూసీ పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు, సిపిఐ శాఖ కార్యదర్శి సహాయ కార్యదర్శులు ఎం హబీబ్ బేగ్, షేక్షా వలి, సాల మద్దిలేటి, మద్దయ్య, హుస్సేన్‌సా నారాయణమ్మ, చాంద్ భాష, కిట్టు, తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లెలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో ఇంటి స్థలం లేని నిరుపేదలు ర్యాలీగా బయలు దేరి వెళ్లి తహశీల్దారు కార్యాలయం నందు సీనియర్ అసిస్టెంట్ శేషాద్రికి వినతిపత్రం అందజేశారు.

ఆత్మకూరులో ఆర్డిఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కార్యాలయ ఏవో శ్రీనివాసులుకి సీపీఐ ఆధ్వర్యంలో అర్జీదారులతో కలిసి వినతి పత్రం సమర్పించారు.

నందికొట్కూరులో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అర్హులైన నిరుపేదలతో ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

కొలిమిగుండ్లలో తహశీల్దార్ కార్యాలయం నందు మండల సీపీఐ, ఏఐటియుసి నాయకులతో కలిసి సీనియర్ అసిస్టెంట్ నాగరాజుకు పేదల ఇంటి స్థలాలపై వినతిపత్రం అందజేశారు

ప్యాపిలిలో సీపీఐ కార్యాలయం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని ర్యాలీ నిర్వహించి సీనియర్ అసిస్టెంట్ సుధాకర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

కోవెలకుంట్లలో సీపీఐ , రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిడి పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు.

గోస్పాడులో సీపీఐ ఆధ్వర్యంలో మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

మహనందిలో సీపీఐ ఆధ్వర్యంలో ఇళ్లులేని పేదలతో కలసి వినతి పత్రం అందజేశారు

అంగరంగ వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

విశాలాంధ్ర - శ్రీశైలం : ప్రముఖ శైవ క్షేత్రంగా శక్తిపీఠంగా విరాజిల్లుతున్న శ్రీశైల మహా క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం వేకువజామునే స్వామి అమ్మవార్లకు విశేష పూజలను ఆలయ అర్చక వేద పండితులు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ఉత్తర ద్వారం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి లోకం సుభిక్షంగా ఉండి సకాలంలో తగినంత వర్షాలు కురిసి కరువు కాటకాలు నివారించబడి లోకంలోని జనులు అంతా సుఖసంతోషాలతో ఉండాలని అర్చక స్వాములు సంకల్పం పట్టించారు. అనంతరం ఉత్తర ద్వారం నుండి స్వామి అమ్మవార్లను రావణ వాహనంపై వేయించింప చేయించి షోడ శోపచార పూజలు అనంతరం ఉత్తర ద్వారమైన శివాజీ గోపురం నుండి స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను గ్రామోత్సవానికి తోడుకొని వచ్చి మేళతాళాల నడుమ శ్రీశైల పురవీధుల్లో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ విశేష కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి ఎం.శ్రీనివాసరావు, దంపతులు ఆలయ అర్చక వేద పండితులు ఆలయ సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్ల ఉత్తర ద్వారాదర్శనాన్ని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు.

పింఛన్ లబ్ధిదారులకు నోటీసులు జారీ

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : పట్టణంలోని పలు గ్రామాలలో 15వేల రూపాయలు పింఛన్ తీసుకున్న లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన మండలంలోని పలు గ్రామాలలో రూ.15వేల పింఛన్ తీసుకున్న లబ్ధిదారులను ప్రభుత్వ వైద్యులు గ్రామాలలోకి వెళ్లి వారికి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. లబ్ధిదారులకు రెండు రోజులు ముందుగానే నోటీసులు ఇచ్చి వైద్యులకు సహకరించాలని ఆయన తెలిపారు.

ఘనంగా సెంట్రల్ లైబ్రరీ ప్రారంభం

లైబ్రరీని ప్రారంభించిన జేఎన్టీయూఏ వైస్ ఛాన్సర్ డాక్టర్ హెచ్ సుదర్శనరావు

విశాలాంధ్ర-పాణ్యం : మండలంలోని నెరవాడ మెట్ట సమీపంలో గల ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం డిజిటల్ రోబో లైబ్రరీని జేఎన్టీయూఏ వైస్ ఛాన్సర్ డాక్టర్ హెచ్ సుదర్శన్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్జియంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం తెలుగు రాష్ట్రాలలో ఎక్కడ లేదన్నారు. మొట్టమొదటిసారిగా రోబోట్ ఆటోమేటిక్ సిస్టంతో పనిచేసే గ్రంథాలయాన్ని ఆర్జియం కళాశాల ప్రారంభించడం అభినందించినదగ్గ విషయం అన్నారు. ఎన్నో విలువైన పుస్తకాలు,దుస్సాన్ రోబోట్,దూ బాన్ రోబోట్, 3డీ ప్రింటర్ యుగాట్ రోబోట్, రోబోట్ వంటి సాంకేతిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా కళాశాల యాజమాన్యం చర్యలు చేపట్టడం ఒక చనియమన్నారు. ఈ సందర్భంగా కళాశాలలోని డేటా సైన్స్ ల్యాబ్ ఎలక్ట్రానిక్స్ మెకానికల్ తదితర ల్యాబ్లను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండేళ్లుగా రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలకు ఫీజు రియంబర్స్మెంట్ చెల్లింపులు నిలిచిపోయాయని అన్నారు. రెండేళ్లుగా దాదాపు 3వేల కోట్ల రూపాయలు ఫీజు రియంబర్స్మెంట్ కళాశాలలకు అందాల్సి ఉందన్నారు. అమ్మఒడి కింద నేరుగా తల్లిదండ్రులకు ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించడంతో కళాశాలలకు విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు చెల్లించేవారు అన్నారు. రెండేళ్లుగా వైసిపి ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించకపోవడంతో జేఎన్టీయూ పరిధిలో 1700 కోట్ల రూపాయలు బకాయిలు నిలిచిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం త్వరలో ఇంజనీరింగ్ కళాశాలలకు ఫీజు రియంబర్స్ మెంటు చెల్లించడానికి చర్యలు చేపట్టిందన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులతో సమావేశం నిర్వహించి విద్యార్థులు తప్పనిసరిగా హాజరు శాతం తగ్గకుండా జాగ్రత్త వహించాలని కోరారు. విద్యార్థుల నైపుణ్యాలను పెంచుకోవడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జీఎం విద్యాసంస్థల అధినేత డాక్టర్ మిద్దే శాంతి రాముడు,ఎండి మిద్దె శివరాం,శాంతిరాం వైద్యశాల ఎండి ఎం రఘురాం,డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్,ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్,హెచ్ ఓ డి డాక్టర్ కిషోర్ కుమార్,రవి శేఖర్, వెంకటేశ్వర్ రెడ్డి, హెచ్వోడీలు విద్యార్థులు పాల్గొన్నారు.

అంబరాన్ని అంటిన సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-అవుకు : పట్టణంలోని మదర్ మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు శుక్రవారం సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. పాఠశాల కరస్పాండెంట్ ముచ్చలపురి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల చిన్నారులు సాంప్రదాయ దుస్తులను ధరించి పాఠశాల ఆవరణాన్ని పండుగ వాతావరణంగా మార్చేశారు. చిన్నారుల ఆటలపాటలతో అందరిని అలరించారు. ఉపాధ్యాయనీలు సంక్రాంతి పండుగకు సంబంధించిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు మాట్లాడుతూ భారత దేశ పండుగలో సంక్రాంతి పండుగ రైతులకు సిరిసంపదలను కురిపించే పండుగ అని అన్నారు. పాడి పంటలతో ప్రతి రైతు ఇంట ధాన్యరాశులతో నిండి ఉంటుందని అన్నారు. కొత్త అల్లుళ్లతో రైతుల ఇల్లు కళకళలాడుతూ ఉంటాయని అన్నారు. విద్యార్థులకు సంక్రాంతి పర్వదిన గొప్పతనాన్ని వివరించారు. అనంతరం పాలు బెల్లం బియ్యంతో బెల్లం పొంగలి చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ముచ్చలపురి రామసుబ్బమ్మ, ప్రిన్సిపల్ ప్రమీల, ప్రధానోపాధ్యాయులు రాయసం మురళీమోహన్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు,విద్యార్థిని,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర - డోన్ రూరల్ : డోన్ 132 కెవి సబ్ స్టేషన్ నందు 33 కెవి ప్యాపిలి బ్రేకర్ మెయింటెనెన్స్ కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు యూ.కొత్తపల్లి, మల్యాల, దేవరబండ, గుండాల సబ్ స్టేషన్‌లకు కరెంటు నిలిపివేయడం జరుగుతుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్ర తెలిపారు.అలాగే ఈ సబ్ స్టేషన్ల పరిధిలోని రైతులకు తెల్లవారుజామున 5 గంటల నుంచి 10 గంటల వరకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు కరెంటు ఇవ్వడం జరుగుతుందని నాగేంద్ర తెలిపారు.

విద్యుత్ ఛార్జీలపై అభిప్రాయ సేకరణ : విద్యుత్ చార్జీల ఆదాయం అవసరాలు ప్రజాభిప్రాయ సేకరణ నేటితో ముగిసింది. ఈ మూడు రోజుల్లో దాదాపు కొంత మంది వారి సలహాలను అభిప్రాయాలను ఏపీ ఇఆర్‌సి కమిటీకీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి.ఈ.ఈ.నాగేంద్ర, ఏ.ఈ.లు నాగేశ్వరరెడ్డి, రేఖ జేఈలు నాగరాజు,మురళి,శివ, జేఏఓ ఆదిలక్ష్మి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేచే గోకులాలు ప్రారంభిస్తాం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చేతుల మీదుగా గోకులాలను ప్రారంభిస్తున్నామని ఎంపీడీవో మహబూబ్ ఖాన్ శుక్రవారం తెలిపారు. మండలంలోని ఎస్ .లింగం దిన్నె, కోట కందుకూరు, యాదవాడ, ఓబులంపల్లె, జి.జంబుదిన్నె గ్రామాలలో గోకులాలు పూర్తి కావడం జరిగిందన్నారు. జనవరి 11న కోట కందుకూరు,12న ఎస్ లింగం దిన్నె గ్రామాల్లో ఎమ్మెల్యే మినీ గోకులం షెడ్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారన్నారు. అలాగే యాదవాడ, ఓబులంపల్లి, జి.జంబులదిన్నె గ్రామపంచాయతీలలోని గోకులాలను అధికారులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అధ్యక్షులు, జడ్పిటిసి సభ్యులు, మండల కో ఆప్షన్ నెంబర్లు, ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, ఉపాధి సిబ్బంది సచివాలయ సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

సంక్షేమాభివృద్ధికి టీడీపీ ప్రాధాన్యత

విశాలాంధ్ర - శిరివెళ్ల : అభివృద్ధి సంక్షేమం తెలుగుదేశం పార్టీకి రెండు కళ్ళు లాంటివని మాజీ జెడ్పిటిసి యామా గుర్రప్ప పేర్కొన్నారు. మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యే భూమ అఖిల ప్రియ ఆదేశాల మేరకు మండల పరిధిలోని పలు గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా చేపడుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం మాదిరి కాకుండా సంక్షేమం ఒకవైపు అమలుపరుస్తూనే మరోవైపు అభివృద్ధి చేస్తున్నట్లు యామ గుర్రప్ప తెలిపారు.

వైసీపీలో ప్రతి కార్యకర్తకు గుర్తింపు

విశాలాంధ్ర - చాగలమర్రి : వైసీపీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు,ఆదరణ లభిస్తుందని రాష్ట్ర వైసీపీ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, మండల కన్వీనర్ కుమార్‌రెడ్డిలు తెలిపారు.శుక్రవారం చాగలమర్రి పట్టణం లోని వైసీపీ కార్యాలయంలో వైసీపీ జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షుడుగా ఎంపికైన షేక్ షబ్బీర్ అహమ్మద్ కు సన్మాన సభ ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ కోసం కష్టపడే వారికి పార్టీ వ్యవస్థాపకులు,మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తప్పక గుర్తిస్తారన్నారు. అనంతరం జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షుడు గా ఎంపికైన షబ్బీర్ అహమ్మద్ ను ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్ష పదవికి ఎంపిక చేసిన మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి,పార్టీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి,ఇతర నాయకులకు జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షుడు షబ్బీర్ అహమ్మద్ కృతజ్ఞతలు తెలిపారు.

స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర-రుద్రవరం : మండల పరిధిలోని చిలకలూరు గ్రామపంచాయతీ సర్పంచ్ గోపవరం ప్రసాద్ రెడ్డి,అన్నపూర్ణమ్మ దంపతులు శుక్రవారం అన్నదానం చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. సుదూర ప్రాంతాల నుండి ఎర్రగుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు పొందుతూ ఉన్న మహిళలకు వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్య ంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా అన్నదానం నిర్వహించారు. సర్పంచ్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం మహా గొప్పదని అందులోనూ గర్భిణీ ,బాలింత మహిళ లకు వారి కుటుంబ సభ్యులకు అన్నదానం చేయడం ఒక పుణ్యఫలం అని పేర్కొన్నారు. అనంతరం వైద్యాధికారులు షబ్బీర్ వలి, భవ్య శ్రీలు,వైద్య సిబ్బంది, ట్రస్ట్ సభ్యులు పూలమాలలతో శాలువలతో ఘనంగా సన్మానించారు.

ఘనంగా స్వామీ వివేకానంద జయంతి

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : జాతీయ యువజన దినోత్సవం జనవరి 12 సందర్భంగా ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పరీక్షలు నిర్వహించారు. జనవరి 12 సెలవు దినం కావున ఈరోజు విద్యార్థులకు స్వామి వివేకానంద బోధనలు, యువతలో ఆయన కలిగించినటు వంటి ఆత్మవిశ్వాసం, స్ఫూర్తి మొదలగు విషయాలను పేర్కొన్నారు. అదేవిధంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి రఘు రామాచార్యులు, మరియు కాలేజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

అపరాల సాగుతో అధిక ఆదాయం

విశాలాంధ్ర - వెలుగోడు : వెలుగోడు మండలం మోత్కూరు, మాధవరం గ్రామలలో రబిలో సాగుచేసిన మినము పంటను ఏవో పవన్ కుమార్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో స్వల్ప కాలంలో మంచి నికర ఆదాయం ఇచ్చే మినిమం, పెసర అంటే అపరాలు, ఆరు తడి పంటలుగా పిలుచుకునే ఈ పంటల సాగు రైతులకు అన్ని విధాలా మేలు చేసేదని, ఇతర సంప్రదాయ పంటలతో పోల్చుకుంటే ప్రాణాధారమైన నీరు, ఎరువులు, పెట్టుబడి వ్యయం, సమయం అన్ని అపరాలకు తక్కువే అని ఏఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో తో పాటు వ్యవసాయ విస్తరణ సిబ్బంది నాగలింగం పలువురు రైతులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

ట్రూ అప్ విద్యుత్ చార్జీలను తగ్గించాలి : సీపీఐ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : పేద. మధ్య తరగతి ప్రజలకు భారమైన విద్యుత్ ట్రూ అప్ చార్జీలు తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ రెగ్యులేటరీ విద్యుత్ కమిషన్ బహిరంగ విచారణ కమిటీ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి సీపీఐ నగర సహాయ కార్యదర్శి మహేష్ అధ్యక్షత వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడు నెలల కాలంలో రాష్ట్రంలోని పేద మధ్యతరగతి ప్రజలపై విద్యుత్ ఛార్జీల15,432 కోట్ల రూపాయలు భారాలు మోపడం చాలా దుర్మార్గమన్నారు. ఏపీ ఈఆర్సీ చైర్మన్ ఠాకూర్‌రామ్ సింగ్, విద్యుత్ రెగ్యులేటర్ కమిషన్ మెంబర్ పివిఆర్ రెడ్డికి వినతి పత్రం అందచేశారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పరిపాలనలో 12 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందని తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచమని అవసరమైతే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని రాష్ట్ర ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకున్న కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ బారాలు మోపి మోసం చేసిందన్నారు. ప్రజలందరూ పెంచేవిద్యుత్ ఛార్జీలను వ్యతిరేకిస్తున్నారని ఈ పెంచే విధానాన్ని మానుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. తక్షణమే ట్రూ ఆఫ్ విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని మానుకోవాలన్నారు. ఏపీఈఆర్సీ పరిపాలన భవనాన్ని కర్నూలులోనే ఉంచాలని అమరావతికి తరలించకూడదని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వినతి పత్రం అందజేయడం జరిగింది. నాయకులు డి.శ్రీనివాసరావు, ఎం.బీసన్న, నల్లన్న, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసులు, డీహెచ్‌పీఎస్ నగర కార్యదర్శి కుమార్‌రాజా, సీపీఐ నగర నాయకులు పుల్లయ్య తదితరులు ఉన్నారు.

అపద్ధాన్ని నిజం చేయడంలో ఎమ్మెల్యే ఘనుడు : మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర- ఆదోని : అపద్ధాన్ని నిజం చేయడంలో ఎమ్మెల్యే పార్థసారధి ఘనుడని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విష్ణు జపం చేసినట్లు ఆ పేరు ఎత్తనిదే ఎమ్మెల్యేకు పొద్దుపోయేలా లేదని, ఇంకా నాలుగేళ్ల సమయం ఉందని, 11 సర్వే నెంబర్లు కాదు, నియోజకవర్గంలోని అన్ని సర్వే నెంబర్‌లు తీసుకొని విచారణ చేసుకో, నేనే తప్పు చేయలేదు, ఎమ్మెల్యేకు భయపడే ప్రసక్తే లేదంటూ మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఘాటుగా సమాధానమిచ్చారు. ఆదోనిలో ఎన్నడూలేని విధంగా ఆత్మ మిత్రుడు డాక్టర్ రవికిరణ్ ఆధార్‌కార్డు మార్చి దొంగ రిజిస్ట్రేషన్, మండిగిరి సర్వే నెంబర్ 321-ఏలో 6.51ఎకరాల నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్‌లో ఎవరి ప్రమేయం వుందో ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ నవ్వుతూనే మోసం చేస్తున్నామని ఆరోపించారు. ఎమ్మెల్యే ఆత్మ డాక్టర్ రవికిరణ్ అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఏ చర్యలు తీసుకున్నావు, ఎమ్మెల్యే ప్రోత్సాహం లేకుండా ఆదోనిలో ఏది జరగడం లేదన్నారు. వైన్ షాపులు, భూముల ఎన్‌ఏ, కాంట్రాక్టర్‌ల, గరుసు, రేషన్ బియ్యం ఇలా ప్రతిదానికి బ్రోకర్లను పెట్టుకొని మామూళ్లు వసూలు చేస్తున్నావని అన్నారు. మొన్న జరిగిన రిజిస్ట్రేషన్‌లో డాక్యుమెంట్ రైటర్‌ను కాపాడేందుకు ప్రయత్నించి, సబ్ రిజిస్టర్ ఎక్కడకి పోయాడని, పోలీసులు పట్టుకోవాలనుకుంటే ఐదు నిమిషాల్లో పట్టుకుంటారని, పట్టుకోకపోవడంపై వెనుక ఎవరి హస్తం వుందో ప్రజలందరికి తెలుసన్నారు. పోలీసులపై నమ్మకం సన్నగిల్లుతోందన్నారు. గతంలో ఎమ్మెల్యేలుగా పని చేసిన రామయ్య, ప్రకాష్‌జైన్, మీనాక్షినాయుడు చాలా మంది నాయకులు ఇలాంటి పాలన చేయాలేదని చెప్పుకొచ్చారు. హైందవశంకరావం పేరుతో ఆదోనిలో పెద్ద పెద్ద వ్యాపారులు, అసోషియేషన్‌ల వాళ్లకు నీవు, నీ పీఏ ఫోన్లు చేసి చేసి డబ్బులు వసూలు చేశావని, చంద్రకాంత్‌రెడ్డి వాళ్ల అసోషియేషన్ నుండి రూ.1.50లక్షలు ఇచ్చాడని అన్నారు. కృష్టమ్మ నీ చిట్టా విప్పుతానని చెబుతోంది ఆ చిట్టా ఏంటో తెలుసుకోవాలనే ఆదోని నుండి ఎక్కడికి పోవడం లేదన్నారు. అపద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తిరుపతి లడ్డుపై దుష్ప్రచారం చేశారు, మొన్న జరిగిన సంఘటనకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. ఆదోని కూటమి పాలనపై చంద్రబాబు దృష్టి సారించాల్సిన అవసరం వుంది. రూ.20కోట్లు ఇచ్చి ఎమ్మెల్యేతో సరి చేసుకున్నాడని వాస్తవాలు తెలుసుకోకుండ నూర్‌అహ్మద్ మాట్లాడడం సబబు కాదన్నారు. ప్రజలకు, కార్యకర్తలకు అండగా వుంటానని, కష్టమని వచ్చిన ప్రతి ఒక్కరికి తన వంతు సహాయం చేస్తానని మాజీ ఎమ్మెల్యే అన్నారు.

పనులు చేయకున్నా రూ.1.27 కోట్లు ఎవరి కోసం : పట్టణంలో డీషిల్ట్ పనులు చేయకున్న రూ.1.27 కోట్లు చేసినట్లు బిల్లులు పెట్టడం ఎవరి కోసం ప్రజల, ప్రభుత్వ సొమ్మును కాజేయాలని చూస్తే ఎవ్వరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. ఎవరో చెప్పారని మున్సిపల్ కమీషనర్, మున్సిపల్ అధికారులను, కాంట్రాక్టర్ కుమ్మక్కై బిల్లులు చేయాలని చూస్తే ఇంటికి పోయేది అధికారులు గుర్తుపెట్టుకోండని హెచ్చరించారు. వైకాపా కౌన్సిలర్లు అక్రమ బిల్లులపై ఆమోదం తెలిపేది లేదని అన్నారు. పనులు చేయకుండ బిల్లులు చేయమంటే కౌన్సిలర్లు, నాయకులు అడ్డుకుంటారని తెలిపారు. ఈ సమావేశంలో వైస్‌చైర్మన్ నరసింహులు, జిల్లా నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, కౌన్సిలర్‌లు చలపతి, ఫయాజ్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు, పట్టాలు ఇచ్చేంత వరకు పోరాడుతాం

విశాలాంధ్ర- ఆలూరు : ఇల్లులేని పేదలలు ఇంటి స్థలాలు, పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా ఆలూరు మండలంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు శుక్రవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో పేదలకు గ్రామాల్లో ఒకటిన్నర సెంట్లు, పట్టణాల్లో ఒక్క సెంటు చొప్పున ఇళ్లస్థలాల పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఆయా ఇళ్ల స్థలాలు పట్టణాలకు దూరంగా, నివాసయోగ్యంకాని ప్రాంతాలలో కేటాయించడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వం ఇచ్చే ఒక్క సెంటు స్థలం పేదల నివాసానికి ఏమాత్రం సరిపోదని, సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆనాడే వైసీపీ ప్రభుత్వానికి చెప్పినప్పటికీ బేఖాతరు చేస్తూ నాటి ప్రభుత్వం మొండిగా ముందుకెళ్లిందని ఆరోపించారు. ఆనాటి లెక్కలతో 32 లక్షల మందికి ఇళ్లపట్టాలు యిచ్చినప్పటికీ పేదలు ఆ స్థలాలపట్ల సుముఖత చూపలేదన్నారు. పైగా ఇంటి నిర్మాణానికి ఇచ్చే ఆర్థిక సహాయం కూడా కేవలం రూ.1.80 లక్షలు ప్రకటించడం జరిగిందన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చినాక జగనన్న ఇచ్చిన ఒక సెంటు స్థలం బాత్రూం కట్టుకుంటేగాని చాలదని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 8నెలలు గడిచిపోయినప్పటికి ఏ ఒక్కరికి ఇంటి స్థలం ఇవ్వలేదని అన్నారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసులను అమలు చేసి భూమిలేని పేదలకు రెండు ఎకరాల భూమి ఇచ్చి వలసలను నివారించవచ్చని అన్నారు. గ్రామాల్లో ఇల్లు లేని పేదలకు మూడు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్ సీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం తాలూకా కార్యదర్శి రంగన్న, రైతు సంఘం అధ్యక్షులు చాపల గోపాల్, సిద్దేశ్వర కాలనీ శాఖ కార్యదర్శి సిద్ధి లింగ, ఎస్ఎస్ భాష, రాజు, ఉల్లిగప్ప, నరసింహులు, మారెప్ప, ఖాదర్, నాసిర్, ఉస్మాన, వసూరు స్వామి, లక్ష్మి తులసమ్మ, జయలక్ష్మి, ప్రభావతి పాల్గొన్నారు.

విశాలాంధ్ర-పత్తికొండ: కూటమి ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శుక్రవారం పత్తికొండలో చదువుల రామయ్య భవనం నుండి ఇళ్ల స్థలాలు లేని లబ్ధిదారులతో కలిసి పట్టణ పురవీధుల గుండా ర్యాలీ చేపట్టి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల ప్రచారంలో భాగంగా తాము అధికారంలోకి వస్తే ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణాలను పూర్తి చేసి ఇస్తామని, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయినా ఏ ఒక్క హామీని నెరవేర్చింది లేదన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే, ప్రభుత్వ భూములను గుర్తించి సీపీఐ ఆధ్వర్యంలో భూ పోరాటం చేసి, పేదలకు ఇళ్ల స్థలాలు పంచుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహ శీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు. సిపిఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి డి. రాజా సాహెబ్, జిల్లా సమితి సభ్యులు గురుదాస్, తిమ్మయ్య, కారన్న, పెద్ద ఈరన్న, మండల సహాయ కార్యదర్శి రంగన్న, శాఖ కార్యదర్శులు గిడ్డయ్య గౌడ్, జొ హోరాపురం కాశి, రాజప్ప, నాగేంద్ర, శంకర్, ప్రజా సంఘాల నాయకులు నెట్టికంటయ్య, సిద్ధ లింగప్ప, మహిళలు పాల్గొన్నారు.

కర్నూలు తహశీల్దార్ కార్యాలయం ముందు..

కర్నూలు రూరల్ తహశీల్దార్ కార్యాలయం ముందు..

హొళగుందలో..

ఎమ్మిగనూరులో..

దేవనకొండలో..

పెద్ద కడబూరులో..

కోడుమూరులో..

నందవరంలో..

ఆస్పరిలో..

గూడూరులో..

ఆదోని రూరల్..

తుగ్గలిలో..

పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలో ప్రతి వీధిన పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం తెల్లవారు జామున బళ్ళారి చౌరస్తా, నరసింహా రెడ్డి నగర్, రోజ స్ట్రీట్, పాత ఈద్గా, సంపత్ నగర్, గాంధీ నగర్, పాత కంట్రోల్ రూం, తదితర ప్రాంతాల్లో కమిషనర్ విస్తృతంగా పర్యటించి, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. నగరంలో ప్రతి వీధిన చివరి వరకు పారిశుద్ధ్య పనులను చేపట్టాలని, ప్రతి రెండు వారాలకు ఒకసారి తప్పనిసరిగా పూడికతీత పనులు చేపట్టాలని కమిషనర్ పారిశుద్ధ్య తనిఖీదారులకు సూచించారు. పూడికతీత పనుల అనంతరం వాటి వ్యర్థాలను ఎప్పటకప్పుడు డంప్ యార్డుకు తరలించాలని, ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పారిశుద్ధ్య పనులు నిర్వహించే క్రమంలో ఏవైనా సమస్యలు ఉంటే ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులతో సమన్వయం చేసుకోవాలని, పారిశుద్ధ్యం లోపిస్తే సంబంధిత తనిఖీదారుడిదే బాధ్యతన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్యధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, పారిశుద్ధ్య తనిఖీదారులు ముంతాజ్ వలి, మునిస్వామి, అనిల్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుతుకు అంతరాయయం

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: మర్మతుల కారణంగా విద్యుతుకు అంతరాయం ఉన్నట్లు విద్యుత్ ఏఈ మద్దిలేటి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ క్రిష్ణగిరి 220 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టడం జరుగుతుందన్నారు. మరమ్మతులు కారణంగా శనివారం మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంకాలం 5.30 గంటల వరకు కరెంట్ ఉండదన్నారు. వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు నేడు ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు త్రీఫేస్ కరెంటు ఇవ్వడం జరుగుతుందన్నారు. క్రిష్ణగిరి, ఆగవేలి, కంబాలపాడు సబ్ స్టేషన్ల పరిధిలో ఉన్న కనెక్షన్లకు మాత్రమే విద్యుత్ అంతరాయం ఉంటుందని, విద్యుత్తు వ్యవసాయ వినియోగదారులు గమనించాలని కోరారు.

రీసర్వే ప్రారంభం : తహశీల్ధార్

విశాలాంధ్ర-గోనెగండ్ల: మండల కేంద్రంలో శుక్రవారం గోనెగండ్ల రీసర్వే గురించి బస్టాండ్ నుంచి గ్రామ పంచాయతీ వరకు రైతులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కుమారస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా గోనెగండ్ల గ్రామంలోని పొలాలు రీ సర్వేకు ఎంపిక చేశామని తెలిపారు. ఈ నెల 20వతేది నుంచి సర్వే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రోజుకు 20 ఎకరాలు చొప్పున 4టీమ్ల ద్వారా సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు రీసర్వేకు సహకరించాలని కోరారు. సర్పంచ్ పూజారి హైమవతి,గౌండ రహుమ్‌తుల్లా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈలను అభివృద్ధి పరచడమే లక్ష్యం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ఎంఎస్ఎంఈలను అభివృద్ధి పరచడమే లక్ష్యంగా పని చేయాలని జనరల్ మేనేజర్ ఎస్.అరుణ సూచించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ సచివాల సిబ్బందికి యూనిట్ల సర్వే చేయడానికి పరిశ్రమల దారులను సంప్రదించినప్పుడు పరిశ్రమ వివరాలను వారికి అందించి, సహకరించాలని కోరారు. వివిధ రకాల ప్రభుత్వ ప్రోత్సాహకాలను పెంపొందించేందుకు అర్హులవుతారని తెలిపారు.

రైతులకు రీసర్వేపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - నందవరం : ఈనెల 20 నుండి గ్రామాల్లో రీసర్వే పనులు ప్రారంభిస్తున్నామని తహశీల్దార్ కె.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని నదికైరవాడి గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేసి, ఆయన మాట్లాడుతూ ఎన్ని ఏళ్లుగా రైతుల భూ సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వేను ప్రవేశపెట్టిందన్నారు. రైతులందరూ రీ సర్వే సమయంలో ముందుగానే సమాచారం అందిస్తామని, తమ వద్ద ఆధారాలతో రైతులు పొలాల దగ్గర ఉండాలన్నారు. ఎలాంటి భూ సమస్యనైనా రీసర్వే ద్వారా పరిష్కరించేందుకు ఇరువర్గాలు సామరస్యంగా పాల్గొంటే భూ సమస్యలు లేకుండా నందవరం మండలాన్ని మొదటి స్థానం నిలబెడతామన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ మహేష్, ఆర్ఐ రెడ్డి, మండల సర్వేయర్ అక్బర్ బాష, టీడీపీ సీనియర్ నాయకులు ఐటీడీపీ వీరేష్, వీరారెడ్డి, బజారి పాల్గొన్నారు.

చదువుతోనే ఉన్నత శిఖరాలు చేరుకోగలం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: చదువుతోనే ఉన్నత శిఖరాలను చేరుకోగలరని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. నగరంలోని కేవీఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, బీ.క్యాంప్‌లోని ప్రభుత్వ ఓకేషనల్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కళాశాలల వార్షికోత్సవ దినోత్సవ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తాను ప్రభుత్వ కళాశాలలోనే చదువుకున్నాని, ప్రభుత్వ కళాశాలల్లోని సమస్యలు తెలుసన్నారు. గవర్నమెంట్ స్కూల్స్, కాలేజిలలో చదువుకునే విద్యార్థులలో ఏదైన సాధించాలన్న కసి, పట్టుదల ఎక్కువగా ఉంటుందన్నారు. కేవీఆర్‌కళాశాల అభివృద్ధికి తన ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు నాగరాజు తెలిపారు.

రీసర్వేపై అవగాహన

విశాలాంధ్ర- గూడూరు: ఈ నెల 20 నుండి గూడూరు పట్టణం, చనుగొండ్ల గ్రామాల పరిధిలో రీసర్వే ప్రారంభిస్తున్నట్లు డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని చనుగొండ్ల గ్రామంలో రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ రీ సర్వేకు రైతులు సహకరించి సమస్యలు రాకుండా పరిష్కరించుకోవాలని సూచించారు. సర్వే డిప్యూటీ తహశీల్దార్ లోకేశ్వర్ రెడ్డి, సర్వేయర్ బాలనాయక్, మండల సీనియర్ అసిస్టెంట్ రాఘవేందర్ రెడ్డి, వీఆర్వోలు జయ రాముడు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

భూ సమస్యలను పరిష్కరిస్తాం : సబ్ కలెక్టర్



విశాలాంధ్ర - హొళగుంద : మండలంలో నీ రైతుల భూ సమస్యలను పరిష్కరిస్తామని ఆదోని సబ్ కలెక్టర్ మంత్రి మౌర్య భారద్వాజ్ అన్నారు. హొళగుందలో వివాదాస్పదంగా ఉన్న భూమిని ఆయన పరిశీలించి ఇరువర్గాల రైతులను విచారించారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో గురువారం సాయంత్రం 7 గంటలకు సమయంలో ఆయన మాట్లాడుతూ డివిజన్లోని భూ సమస్యలను రెవెన్యూ రికార్డుల ప్రకారంగా పరిశీలించి పరిష్కరిస్తామని బాధిత రైతులకు అండగా ఉంటామని అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో మధ్య దళారుల బెడద అధికంగా ఉన్నదని విలేకరులు మధ్య దళారుల బెడదను నివారించడానికి నియంత్రిస్తానని, తరచూ తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తానని అన్నారు. రెవిన్యూ ఉద్యోగుల పట్ల ప్రజలకు విశ్వాసం కలిగిన పనిచేస్తామని ఎవరికీ ఎలాంటి ఆందోళన అవసరం లేదని పక్కగా రైతులకు న్యాయం చేయదానికితాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నానని అన్నారు. భూ సమస్యలను రెవెన్యూ రికార్డులను పరిశీలించి ప్రశాంత వాతావరణంలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. సబ్ కలెక్టర్ మంత్రి మౌర్య భారద్వాజ్ వెంట తహశీల్దార్ కె.సతీష్, డిప్యూటీ తహశీల్దార్ డి.నిజాముద్దీన్, వీఆర్వో తిప్పన్న, సర్వేయర్ మౌనిష్ ఆచారి, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ నాయక్, కానిస్టేబుల్ రాజగోపాల్ రైతులు తదితరులు పాల్గొన్నారు

ప్రత్యక్ష ఆందోళనలు నిర్వహిస్తాం..

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు ఇచ్చిన సెలవుల్లో కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు క్లాసులు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాయని, సంక్రాంతి సెలవుల్లో క్లాసులు నిర్వహిస్తే అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకునేలా ఆందోళనలు చేస్తామని ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.అభి, సి.ఆశోక్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు హెచ్చరించారు. నగరంలోని స్థానిక సీఆర్ భవన్ నందు ఏఐఎస్ఎఫ్ నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సంక్రాంతి సెలవులలో ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో క్లాస్ నిర్వహిస్తే అలాంటి విద్యాసంస్థలను సీజ్ చేసి, వాటి గుర్తింపు రద్దు చేయలని విద్యార్థులకు అండగా వారు పిలుపునిచ్చారు. సంక్రాంతి సెలవులలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తరగతులు నిర్వహిస్తే ప్రత్యక్ష ఆందోళనలు చేస్తామన్నారు. ఉపాధ్యక్షులు ఎం.వర్ధన్, నగర నాయకులు చందు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేపై అవగాహన

విశాలాంధ్ర - సి.బెళగల్: రైతుల భూముల రీసర్వేపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లో సర్వేపై ర్యాలీ నిర్వహించి అనంతరం ఇంచార్జీ తహశీల్దార్ పురుషోత్తముడు మాట్లాడుతూ ఈనెల 20వ తారీకు నుండి చేపడుతున్న భూముల రీసర్వేకు రైతులు సహకరించి సమస్యలు లేకుండా పురస్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి తహసిల్దార్ పురుషోత్తంతోపాటు భూముల రీ సర్వే రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటేష్, సర్వేయర్ నాగభూషణం, వీఆర్వోలు, వీఆర్ఏలు తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి ఘటన బాధాకరం

విశాలాంధ్ర-ఆలూరు : తిరుపతి ఘటన అత్యంత బాధా కరమని, శుక్రవారం ఆలూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ఇంచార్జీ చెప్పిగిరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, వైకుంఠ ఏకాదశి దర్శనం టోకెన్ల కోసం వచ్చిన భక్తులు తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని, జరిగిన ఘటన పై న్యాయ విచారణ జరిపించాలని, మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేస్తున్నామని, తిరుమల తిరుపతి దేవస్థానం చరిత్రలో తొలిసారి విషాద సంఘటన అని అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం ఈ ఘటనకు కారణం కావచ్చని, మృతుల కుటుంబాలకు 25 లక్షల రూపాయలు పరిహారం చెల్లించి చేతులు దులుపుకోవడం అన్యాయమని, ఆ కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం ప్రకటించాలని, వారి ఇంట్లో అర్హులు ఉంటే ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిసి కూడా కనీస ఏర్పాట్లు చేయకపోవడం పాలన యంత్రాంగం వైఫల్యానికి నిదర్శనమనీ ఆరుగురు భక్తులు చనిపోయిన ఘటనపై నైతిక బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం వహించాలన్నారు. కార్యక్రమంలో తుమ్మల బీడు లక్ష్మన్న, మొలగవల్లి రామాంజనేయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ యూత్ కల్చరల్ ఫెస్టివల్ కర్నూలుకి గర్వకారణం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : సౌత్ ఏసియా పేస్ కాన్ఫరెన్స్, ఇంటర్నేషనల్ యూత్ కల్చరల్ ఫెస్టివల్ ఇక్కడ జరగడం కర్నూలు నగరానికే గర్వకారణమని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. శుక్రవారం టీజీవి ఫైన్ ఆర్ట్స్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నగర శివారులో ఉన్న మాంటిస్సోరి ఇండస్ స్కూల్ నందు ఈ కార్యక్రమాన్ని టీజీ వెంకటేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి పరిరక్షణ కోసం వివిధ దేశాల నుంచి ప్రతినిధులు రావడం ఆనందంగా ఉందన్నారు. వివిధ ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ యువతలో చైతన్యాన్ని కల్పిస్తూ, సమైక్యత భావాన్ని పెంపొందించడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లాంగ్వేజ్ ఎక్స్ఛేంజ్, కల్చరల్ ఎక్స్ఛేంజ్, సాంస్కృతిక ప్రదర్శనలు మరియు శాంతి సందేశాలతో కూడిన క్లాసులని వినియోగించుకొని దేశానికి దేశ భవిష్యత్తుకు యువత ఉపయోగపడాలన్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనే యువత సద్భావన, సత్ సంప్రదాయాలతో విలువైన సంస్కృతిని నేర్చుకోవాలని టీజీ వెంకటేష్ కోరారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, ప్రపంచ శాంతికి మేము సైతం అంటూ వారు ఎల్లప్పుడూ ముందు ఉండి శాంతికి తోడ్పడుతారని ఆశిస్తున్నట్టు టీజీ వెంకటేష్ అన్నారు. మాంటిస్సోరి విద్యాసంస్థల డైరెక్టర్ రాజశేఖర్, ఢిల్లీ పార్లమెంటులో మీడియా ఆర్గనైజర్ కీర్తి, గోపాల్, రాజీవ్, గౌరీ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

విశాలాంధ్ర-కోడుమూరు: స్థానిక రసాయనిక ఎరువులు, మందులు దుకాణాల ఇంటర్నల్ స్క్వాడ్ తనిఖీలలో భాగంగా డిఆర్సి-ఏడిఏ వెంకటేశ్వర్లు, కర్నూలు డివిజన్ ఏడీఏ ఎన్ సాలురెడ్డిలు ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. శుక్రవారం కోడుమూరుకు చేరుకున్న డీఆర్సీ-ఏడీఏ వెంకటేశ్వర్లు, కర్నూలు డివిజన్ ఏడీఏ ఎన్ సాలురెడ్డిలు మండల వ్యవసాయ అధికారి ఎన్ రవిప్రకాష్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీవెంకటేశ్వర ఫర్టిలైజర్స్, శ్రీ లక్ష్మీ ఫర్టిలైజర్స్ దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాల యజ మానులు స్టాక్ రికార్డులు అప్డేట్ చేసి ఉంచుకోవా లన్నారు. ప్రతిరోజు స్టాక్ రికార్డ్ లలో వివరాలు అప్డేట్ చేయాలని ఆదేశిం చారు. రైతులకు ఈపాస్ మిషన్లలో మాత్రమే విక్రయిం చాలని, ఎమ్మార్పీ ధరలకు మించి అమ్మ రాదని తెలిపారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, శనివారం 11, జనవరి 2025

అహోబిల క్షేత్రంలో ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రముఖ వైష్ణవ పుణ్య క్షేత్రమైన అహోబిలంలో వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలు మేనేజర్ మురళీధరన్, ప్రధాన అర్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వణికించే చలిని లెక్క చేయకుండా భక్తులు లక్ష్మీనరసింహస్వామి వారిని వైకుంఠ ద్వారాల గుండా దర్శించు కున్నారు. దేవస్థానం నిర్వాహకులు భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్ లను ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున మూడు గంటల నుండే భక్తుల రద్దీ ప్రారంభమైంది. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెల్లవారు జామునే శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎగువ, దిగువ అహోబిలం క్షేత్రాలను ఆమె దర్శించుకు న్నారు. ఆలయ వేద పండితులు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అనంతరం పూజలు నిర్వహించి శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, రైతులు పాడి,పంటలు సమృద్ధిగా ఉండి వారి కుటుంబాల్లో ఆనందం వెల్లి విరియాలని లక్ష్మీ నరసింహస్వామి వారిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మీడియాకు తెలిపారు. రానున్న రోజులలో అహోబిలం క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని, ఎగువ అహోబిలంలో రోప్ వే ఏర్పాటుకు కృషి చేస్తామని వివరించారు. అహోబిలంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో రూరల్ సీఐ దాది మురళీధర్ రెడ్డి గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల టిడిపి మాజీ ఉపాధ్యక్షులు గూడూరు సంజీవ రాయుడు ఉన్నారు.

రెండో రోజు నేషనల్ జూనియర్ రోల్ బాల్ పోటీలు



విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : స్థానిక రిడ్జ్ పాఠశాలలో గురువారం నుండి జరుగుతున్న నేషనల్ జూనియర్ రోల్ బాల్ పోటీలు విజయవంతంగా జరుగుతూ ఉన్నాయి. దేశంలోని మొత్తం 20 రాష్ట్రాల నుండి వచ్చిన జట్లు ఒక జట్టుపై ఒకరు ఎంతో నైపుణ్యంతో ధృడసంకల్పంతో విజయమే లక్ష్యంగా తలపడుతున్నారు. శు క్రవారం ఈ పోటీలను పోటీలకు కేంద్ర భారీ పరిశ్రమల శాఖామాత్యులు భూపతి రాజు శ్రీనివాస్ వర్మ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వారు క్రీడాకారులతో మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక ధృఢత్వమునకు ఎంతో కీలకమన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తూ భారతదేశపు యువశక్తిని ప్రపంచ దేశాలకు తెలియజేయాలన్నారు. విద్యార్థులు అన్ని రంగాలలో రాణిస్తూ మీ ప్రతిభను చాటాలన్నారు.జాతీయ స్థాయి క్రీడాపోటీలు సైతం నిర్వహించుకోవడానికి వేదికైన ఇంత చక్కటి విద్యా ప్రాంగణాన్ని ఈ క్రీడల కోసం మీకు కేటాయించిన పాఠశాల వ్యవస్థాపకులు పుల్లయ్యని, పాఠశాల సీఈవోలు జి.గోపీనాథ్, జి.సౌమ్య గోపీనాథ్ గార్లను ప్రత్యేకంగా అభినందించుకోవాలన్నారు. అనంతరం పాఠశాల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన వసతులను, సౌకర్యాలను తాము ఎన్ని ఇక్కట్లను ఎదుర్కొన్న తప్పక వారికి అందించడానికి ఎల్లప్పుడూ రవీంద్ర విద్యా సంస్థలు ముందు వరుసలో ఉంటాయని వ్యక్తం చేశారు. యువశక్తి అవసరం ఈ దేశానికి ఎంతో అవసరమన్నారు. యువశక్తి దేశ పునర్నిర్మాణ శక్తి అని గుర్తు చేశారు. ప్రపంచదేశాలంతా తమ వైపు చూసేలా చేస్తున్న మన ప్రియతమ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారిని మనమంతా ఆదర్శంగా తీసుకోవాలన్నారు .ఈ కార్యక్రమంలో పాఠశాల సీఈవోలు జి.గోపీనాథ్, జి.సౌమ్య గోపీనాథ్ గార్లతోపాటు డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపాల్ రాజ్ కమల్, రోల్ బాల్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ జి.చంద్రమౌళి, రోల్ బాల్ రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్ రెడ్డి, ప్రోగ్రాం ఆర్గనైజింగ్ కన్వీనర్ సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

విశాలాంధ్ర - మద్దికెర: రాష్ట్రంలో నిరుపేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు యాదవ్, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు కామ్రేడ్ కోదండ రాముడుల ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు రాజా సాహెబ్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి పాపన్న, నాగిరెడ్డి, రామాంజనేయులు, రంగస్వామి తదితర నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రాష్ట్ర మంత్రి కుమార్తె రిసెప్షన్ వేడుక

విశాలాంధ్ర - కర్నూలు: నగరంలోని ఎస్ఏపీ క్యాంపులో నిర్వహించిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ కుమార్తె రిసెప్షన్ వేడుక వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కర్నూలుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుండి వేలాదిగా ప్రజలు తరలివచ్చి నూతన దంపతులను ఆశీర్వదించారు. కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సవితమ్మ, ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ, జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, భూమా అఖిలప్రియ, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, బీవీ జయ నాగేశ్వర్రెడ్డి, పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రులు పల్లె రఘునాథ్ రెడ్డి, పరిటాల సునీత, ప్రముఖ నాయకులు, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు హాజరయ్యారు.

నేటి నుండి శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



విశాలాంధ్ర - శ్రీశైలం : శ్రీశైలం మహా క్షేత్రంలో నేటి నుండి మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకొని శనివారం నుండి 17వ తేదీ వరకు సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ఏడు రోజులపాటు ఎంతో వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు కార్యనిర్వహణ అధికారి ఎం శ్రీనివాసరావు తెలిపాడు శనివారం ఉదయం యాగశాల ప్రవేశంతో ప్రారంభమయ్యే సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ప్రత్యేక పూజలు ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజ పాతాక ఆవిష్కరణ బ్రహ్మోత్స వాల్లో భాగంగా ప్రతిరోజు స్వామి అమ్మవార్లకు విశేష పూజలు మండ పారాధనలు పంచవర్ణార్చనలు రుద్రహోమము చండీ హోమం, నిత్య హవనాలు 12వ తేదీ నుండి ప్రత్యేక వాహన సేవలు గ్రామోత్సవం, స్వామి అమ్మవార్లకు విశేషాలంకరణలు 12న బృంగి వాహన సేవ, 13న కైలాస వాహన సేవ, 14 నంది వాహన సేవ, బ్రహ్మోత్సవ కళ్యాణం, 15 రావణ వాహన సేవ, 16 పూర్ణాహుతి సదస్యం నాగవల్లి ధ్వజవరోహణ, 17న అశ్వవాహన సేవ, పుష్ప ఉత్సవం శయనోత్సవా సేవలతో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

శ్రీశైల మల్లన్నకు విశేష పుష్పార్చన

విశాలాంధ్ర - శ్రీశైలం : సేవ క్షేత్రంగా శక్తిపీఠంగా విరాజిల్లుతున్న శ్రీశైల మహా క్షేత్రంలో పుష్య శుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వాళ్లకు లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ 4 వేల కేజీల 40 రకాల పూలతో స్వామి అమ్మ వారిలో ఉత్సవ మూర్తులకు విశేష పుష్పార్చనను ఎంతో వైభవంగా అర్చక స్వాములు నిర్వహించారు మల్లికా పుష్పాలతో పూజింపబడిన కారణంగానే స్వామి వారికి మల్లికార్జునుడు అనే పేరు ఏర్పడింది. యుగయుగాల నుండి కరవీరుడు పుష్ప దంతుడు చంద్రావతి మొదలైన భక్తులు స్వామి వారిని శ్రీ భ్రమరాంబ దేవిని పుష్ప కైంకర్యాన్ని చేసి తరించారు అందువల్లనే లోక కళ్యాణం కోసం పుష్య శుద్ధ ఏకాదశిన స్వామి అమ్మవార్లకు విశేష పుష్పార్చన చర్పించబడింది ఈ కార్యక్రమంలో దేవస్థాన వేద పండితులే కాకుండా ఇతర ప్రాంతాల నుండి కూడా వచ్చినటువంటి వేద పండితుల చేత చతుర్వేద పారాయణాలు జరిపించబడ్డాయి ఈ పుష్ప కైంకర్యానికి అవసరమైన పుష్పాలు అన్నిటిని కూడా రామచంద్ర యాదవ్ పుంగనూరు వారు పూర్తిగా విరాళంగా అందించారు ఈ విశేష కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎం శ్రీనివాసరావు దంపతులు ఆలయ అధికారులు అర్చక వేద పండితులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్ల పుష్పార్చన సేవను తిలకించి ఆధ్యాత్మిక అనుభతికి లోనైనారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటాం

విశాలాంధ్ర - ఆదోని రూరల్: ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు సంక్రాంతి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే డిఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో అడ్డుకుంటామని డిఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు రఘు, మండల కార్యదర్శి వినీల్ శుక్రవారం మీడియా సమావేశంలో హెచ్చరించారు. ర్యాంకుల పేరుతో విద్యాసంస్థల మెప్పు కోసం విద్యార్థుల మానసిక స్థితిగతులతో యాజమాన్యాలు చెలగాటమారడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం విద్యార్థుల మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకే సెలవులను ప్రకటించడం జరుగుతుందని, సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే అటువంటి విద్యాసంస్థల ముందు ఆందోళన కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేసేందుకు సన్నద్ధమవు తామన్నారు.

భూ రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు: భూ రీసర్వేను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని నౌలేకల్ గ్రామంలో రీ సర్వేపై గ్రామ సభ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రీ సర్వేపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామ సభలో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 3వేల ఎకరాలకు పైగా భూమి ఉందన్నారు. రీసర్వే కోసం నాలుగు టీములను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కో టీము ప్రతి రోజూ 20 ఎకరాలు కొలుస్తుందన్నారు. రైతులు ఊరిలో లేకపోతే వారికి సమాచారం అందించాలన్నారు. రైతులు భూ రీసర్వేకు తప్పనిసరిగా హాజరు కావాలని, లేకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. భూ రీసర్వే ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభం అవుతుందని తెలిపారు. కావున ప్రతి రైతు భూ రీసర్వేలో పాల్గొని తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనాథ్, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

13న బండలాగుడు పోటీలు

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : మండలంలోని తరిగొప్పుల గ్రామంలో శ్రీ అనంత నాగేశ్వర స్వామి శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి సంక్రాంతి తిరుణాల సందర్భంగా న్యూ క్యాటగిరి సైజు గల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు మందడి నారాయణరెడ్డి, మద్దికుంట నాగార్జున రెడ్డి, మందడి దొరబాబు రెడ్డి, మద్దికుంట మహేష్ రెడ్డి, కోట్ల ఆది నారాయణరెడ్డి, కుర్వ శ్రీరాములు శు క్రవారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే ఎద్దుల యజమానులు ప్రవేశ రుసుము 600 రూపాయలు చెల్లించి వారి పేర్లు నమోదు చేసుకోవాలని వారు తెలిపారు. ఈ బండలాగుడు పోటీలలో గెలుపొందిన ఎద్దులకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండవ బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.10 వేలు, ఆరో బహుమతి రూ.5 వేలు నగదును అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాల కోసం 9963926943, 9963735933, 9704040782, 990 863 8824 నెంబర్లను సంప్రదించాలని వారు సూచించారు, ఈ పోటీలలో పాల్గొనే వారికి భోజన వసతి ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

సంక్షేమ హాస్టల్, పాఠశాలను పరిశీలించిన మంత్రి

విశాలాంధ్ర - బనగానపల్లె : బనగానపల్లె సమీపంలోని రవ్వలకొండ ప్రాంతంలోని బాలురు సాంఘిక సంక్షేమ హాస్టల్ మరియు పాఠశాలను రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్ మరియు పాఠశాల అపరిశుభ్రంగా ఉండటంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.హాస్టల్ మరియు పాఠశాలకు అవసరమైన మేరకు మరమ్మతులు చేసి రంగులు వేయాలని అధికారులకు సూచించారు.సాంఘిక సంక్షేమ హస్టల్ నే పాఠశాలగా వినియోగిస్తున్న నేపథ్యంలో, వేర్వేరు భవనాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కొత్తగా పాఠశాల తరగతుల భవనం నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూడిఐని ఏఈ మధుబాబు, ప్రిన్సిపాల్ బాలాజీ, వార్డెన్ నాగేంద్ర, రామలింగారెడ్డి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

విశాలాంధ్ర-అవుకు: పట్టణంలోని అతి పురాతనమైన భూలక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వైసీపీ ముఖ్య నాయకులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, వైసీపీ నాయకులు పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డిలు ఈ ఉత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేకంగా తెప్పించిన వివిధ రకాల పుష్పాలతో ఆలయాన్ని అందంగా అలంకరించారు. వేకువ జాము నుండే అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి వైకుంఠ ద్వార దర్శనంతో స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి ఉత్సవ మూర్తులను పట్టణ పురవీధుల గుండా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరము భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. మెట్టుపల్లి దారిలోని సుద్ద కొండపై వెలసిన మద్దిలేటి స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

టీడీపీ మండల అధ్యక్షునికి వెల్లువెత్తిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండల కేంద్రం లోని టీడీపీ కార్యాలయం నందు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర రెడ్డి జన్మదిన వేడుకలను కార్యకర్తలు, నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు అభిమానులు ఏర్పాటుచేసిన బారి కేకును ఆయనతో కట్ చేపించి స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన వారు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆప్తుడిగా, సౌమ్యుడుగా పేరొందిన రామేశ్వర రెడ్డి పేదలు కార్యకర్తల అభివృద్ధికి పాటుపడుతూ మరెన్నో ఉన్నత పదవులు పొందాలని నాయకులు కార్యకర్తలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూలి నాగేశ్వరరెడ్డి, కోటపాడు శివరామిరెడ్డి, నిమ్మకాయల దస్తగిరి, మధుసూదన్ రెడ్డి, వేణు, ప్రసాద్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సంక్రాంతి ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: ఎన్జీవో కాలనీ శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయులకు సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీలను శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ పెద్దిరెడ్డి పద్మారెడ్డి, డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి ప్రారంభించారు. పాఠశాల ఆవరణంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో సుమారు 200 మంది పైగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షేక్షావలి రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ రైతులకు ఎంతో ముఖ్యమని, రైతులు ఆనందంగా జరుపుకునే పండుగ సంక్రాంతి అన్నారు. ఈ సంక్రాంతి రోజున ఇంటి ముంగిళ్ళలో ముగ్గులతో అందంగా అలంకరించుకుంటారన్నారు. ముగ్గులే సంక్రాంతికి పండుగకు ప్రత్యేకత అని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు వేసిన ముగ్గులను జడ్జి లలితా సరస్వతి పర్యవేక్షించి విజేతలను నిర్ణయించారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయిలను బహుమతులు అందజేశారు.

కన్నుల పండుగ్గా శ్రీ మద్దిలేటి స్వామి వారి కళ్యాణ మహోత్సవం

విశాలాంధ్ర - బేతంచెర్ల : బేతంచర్ల మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ సమీపంలో వెలిసిన ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మద్దిలేటి స్వామి వారి కళ్యాణ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా వేలాది మంది భక్త జన సందోహం మధ్యన కన్నుల పండుగ జరిగింది.

ఉత్తరద్వారా దర్శననికి పోటెత్తిన భక్తులు : ముందుగా పుష్య శుద్ధ ఏకాదశి శు క్రవారం తెల్లవారుజామున ఆలయ వేద పండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ్ చక్రవర్తి,ముఖ్య అర్చకులు మద్దిలేటి స్వామిలు స్వామివారి ధ్రువ మూర్తికి మహా స్నాపన తిరుమంజనం, చందనాలంకరణ సేవ, విశేష పుష్పలాంకరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించగా జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించు కున్నారు. ఎమ్మెల్యే కోట్ల తనయుడు కోట్ల రాఘవేంద్రా రెడ్డి, గౌరమ్మ దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు.

ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి

విశాలాంధ్ర - బనగానపల్లె: బనగానపల్లె ప్రభుత్వాసు పత్రిని రోడ్లు భవనాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి ప్రభుత్వాస్పత్రిలో అందుతున్న వైద్య సేవల వివరాలను స్వయంగా డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రోగులకు సరిపడా మందులు, పరికరాలు, మెడికల్ కిట్లు వంటివి అందుబాటులో ఉంచుకోవాలని, ఆస్పత్రిని పారిశుద్ధ్యంగా, ప్లాస్టిక్ రహితంగా ఉంచాలని డాక్టర్లకు సూచనలు చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలపై స్వయంగా వారిని అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్లో కావాల్సిన కనీస మౌలిక సదుపా యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్న తర్వాత తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఎర్రమట్టి బిల్లులో అక్రమాలు



విశాలాంధ్ర - సి.బెళగల్ : గ్రామంలో వీధుల్లో అవసరమైన ఎర్ర మట్టి తరలింపులో అక్రమాలు జరిగాయని ఆ గ్రామ పెద్దలు పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. సి బెలగల్ మండల పరిధిలోని గొల్లల దొడ్డి గ్రామంలో గ్రామంలోని వీధులలో ఉన్న గుంతలకు అవసరమైన ఎర్రమట్టి తరలింపులో అక్రమాలు జరిగాయని గ్రామ పెద్దలు శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారికి పిర్యాదు చేశారు. ఎర్రమట్టి వరుపు కోసం గతేడాది సర్పంచ్ కొడుకు లోకేస్ సుమారు 4 లక్షల వరకు పంచాయతీ బిల్లు అందుకున్నారని వారన్నారు. వాస్తవానికి గుంతల పూడికకు లక్ష లోపు కూడా బిల్లు కాదని పలుకుబడితో పంచాయతీ బిల్లు అధికంగా చేసుకొని ప్రజాధనం ఆక్రమించుకోవడమేనని విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని గ్రామ పెద్దలు కోరారు.

శ్రీ ఉమా మాధవ పాఠశాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని స్థానిక సంతోషనగర్లోని శ్రీ ఉమా మాధవ పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపాధ్యాయులకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బి.మాధవ కృష్ణ మాట్లాడుతూ ప్రాచీన కళలు, ఆటలు ఇవి అన్నీ మన భారతీయ సంస్కృతిని పెంపొందించేవన్నారు. కళలను మరుగు పడకుండా కాపాడుకోవలసిన బాధ్యత ఆధునిక సమాజంలో అందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కళ్ళు ఇలాంటి ప్రాచీన కళలను, క్రీడలను ఉత్సాహపరిచి నేటి తరానికి స్ఫూర్తినివ్వాలని గుర్తు చేశారు. ఈ ముగ్గుల పోటీలలో విజయం సాధించిన వారికి పాఠశాల కరస్పాండెంట్ బి.మాధవకృష్ణ బహుమతులు ప్రధానం చేయడం జరిగింది.

ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా: మండలంలోని తరిగొప్పుల గ్రామంలో శ్రీ అనంత నాగేశ్వర స్వామి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి సంక్రాంతి తిరునాల సందర్భంగా జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రౌండ్ లో ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం గ్రామ పెద్దలు మందడి నారాయణరెడ్డి, మద్దికుంట నాగార్జున రెడ్డి, మద్దికుంట మహేష్ రెడ్డి, మందడి దొరబాబు రెడ్డి, కోట్ల ఆది నారాయణ రెడ్డిలు తెలిపారు. ఈ కబడ్డీ పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 20 వేలు ,రెండవ బహుమతి 10 వేలు, మూడవ బహుమతి 5 వేలు, నాలుగవ బహుమతి రూ.2500 లు బహుమతులు అందజేయినట్లు వారు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే జట్లు ఈనెల 13వ తేదీ సాయంత్రం లోపల 300 రూపాయలు ఎంట్రీ ఫీజు చెల్లించి తమ జట్ల పేర్లు నమోదు చేసుకోవాలని వారు తెలిపారు. కబడ్డి క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. వివరాల కోసం 9391731979, 8639168705, 8688158175. నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

అపరాల సాగుతో అధిక ఆదాయం

విశాలాంధ్ర - వెలుగోడు : వెలుగోడు మండలం మోత్కూరు, మాధవరం గ్రామలలో రబిలో సాగుచేసిన మినము పంటను ఏవో పవన్ కుమార్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో స్వల్ప కాలంలో మంచి నికర ఆదాయం ఇచ్చే మినిమం, పెసర అంటే అపరాలు, ఆరు తడి పంటలుగా పిలుచు కునే ఈ పంటల సాగు రైతులకు అన్ని విధాలా మేలు చేసేదని, ఇతర సంప్రదాయ పంటలతో పోల్చుకుంటే ప్రాణాధారమైన నీరు, ఎరువులు, పెట్టుబడి వ్యయం, సమయం అన్ని అప రాలకు తక్కువే అని ఏఓ తెలిపారు. ఈ పంటలు భూమిని సారవంతం చేస్తాయి. తక్కువ కాలపరిమితి కావడం వల్ల అంతర పంటలుగా పండించుకునే అవ కాశాలు ఎక్కువన్నారు.సంప్రదాయ ఆహార ధాన్యాల పంట లతో పోల్చితే అపరాల పంటలకు నీరు, ఎరువులు, పెట్టుబడి, సమయం అన్ని తక్కువే.ఎకరం వరి పండించే నీటితో నాలుగు ఎకరాల్లో పప్పు ధాన్యాల పంటలు పండించవచ్చని శాస్త్రీయంగా నిరూపితమైంది. ఇటీవలి కాలంలో ఈ పంటల సాగు విస్తీర్ణం పెరుగుతూ శాస్త్రీయ విధానాలు అవలంబి స్తుండడంతో మంచి దిగుబడులు వస్తున్నాయి. ఏవో తో పాటు వ్యవసాయ విస్తరణ సిబ్బంది నాగలింగం పలువురు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి శిల్పా జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : స్థానిక వైసీపీ కార్యాలయంలో నంద్యాల జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు డాక్టర్ దాల్మిల్ అమీర్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించి, కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ ఇషాక్ బాష, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నిసా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మాట్లాడుతూ మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి నిండు నూరేళ్లు, ఆయురారోగ్యంతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సామాజిక సేవ, రాజకీయ రంగంలో గొప్ప వ్యక్తిగా అందరికీ ఆదర్శనీయుడుగా స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని కొనియాడారు. స్వశక్తితో ఉన్నత స్థానాన్ని అధిరోహించారని, రాజకీయ రంగంలో ఎందరికో ఆదర్శప్రాయుడిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, వైఎస్ఆర్సివి నంద్యాల జిల్లా జనరల్ సెక్రెటరీ సోమశేఖర్ రెడ్డి, నంద్యాల డిస్ట్రిక్ట్ వైయస్సార్ జనరల్ సెక్రెటరీ ఆర్గనైజర్స్ దేవనగర్ బాష, హరి, వైఎస్సార్ జిల్లా అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్, వైసీపీ జిల్లా మేధావుల ఫోరం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, వైసీపీ జిల్లా మున్సిపల్ లివింగ్ ప్రెసిడెంట్ టివై శివయ్య, వైఎస్ఆర్సివి నంద్యాల జిల్లా కల్చరల్ వింగ్ ప్రెసిడెంట్ టీవీ రమణ, కౌన్సిలర్స్ చంద్రశేఖర్, సాదిక్, సమ్మద్, కలాం బాష, ఆరిఫ్ నాయక్, కోఆప్షన్ సభ్యులు వడకండ్ల సుబ్రహ్మణ్యం, సలాముల్ల, వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

గర్భిణీ బాలింత మహిళలకు అన్నదానం చేసిన సర్పంచ్ దంపతులు

విశాలాంధ్ర - శిరివెళ్ల: మండల పరిధిలోని యర్ర గుంట్ల మేజర్ గ్రామపంచాయతీలో గల ప్రభుత్వ వైద్య శాలలో రుద్రవరం మండలం చిలకలూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ గోపవరం ప్రసాద్ రెడ్డి అన్న పూర్ణమ్మ దంపతులు శుక్రవారం అన్నదానం చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. సుదూర ప్రాంతాల నుండి ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి వైద్య ఆరోగ్య సేవలు పొందుతూ ఉన్న మహిళలకు వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిలకలూరు గ్రామానికి చెందిన గోపవరం రామిరెడ్డి తులసమ్మ దంపతుల కుమారుడు గోపవరం ప్రసాదరెడ్డి అయన సతీమణి పూర్ణమ్మ దంపతులు వైకుంఠ ఏకాదశి సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ సంద ర్భంగా సర్పంచ్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ అన్నదానం మహా గొప్పదని అందులోనూ గర్భిణీ బాలింత మహిళలకు మరియు వారి వెంట వచ్చిన కుటుంబ సభ్యులకు అన్నదానం చేయడం ఒక పుణ్యఫలం అని అన్నారు. వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తూ ఎందరో మహిళలకు అన్నదానం నిర్వహించి ప్రత్యక్షంగా పరోక్షంగా కారణమవుతూ మానవతా దృక్పథాన్ని చాటు కుంటున్న వివేకానంద సొసైటీ సేవలను కొనియాడారు. పలువురు ప్రముఖులు పారిశ్రామిక వేత్తలు విద్యా ఉద్యోగులు అన్నదాన కార్యక్రమానికై చేయూత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. చిలకలూరి గ్రామపంచాయతీ సర్పంచ్ ప్రసాద్ రెడ్డి దంపతులను వివేకానందా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఘనంగా సన్మానం చేశారు.